## పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

భిక్కనూరు/బీబీపేట్, జనవరి 29 : భిక్కనూరు మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంటను మాల్తుమ్మెద ఏరువక కేంద్రం శాస్త్రవేత్త ఏనుగు అనిల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి సోమవారం పరిశీలించారు. అనంతరం జంగంపల్లి రైతు వేదికలో ఏర్పాటుచేసిన సమవేశంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే పురుగు మందులు, ఎరువులను వినియోగించాలన్నారు. ఏవో రాధారెడ్డి, ఏఈవోలు వినోద్‌గౌడ్, రజిత, రైతుబంధు సమితి గ్రామ కన్వీనర్ శివలింగం, సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి పాల్గొన్నా రు. బీబీపేట్, రాంరెడ్డిపల్లిలో ఏఈవో రాఘవేంద్ర వరి పంటలను పరిశీలించారు. పంటలో కాండం తొలుచు పురుగును గుర్తించి, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

## దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జనవరి 29 : కామారెడ్డి జిల్లాలోని ఆరు మైనార్టీ గురుకుల పాఠశాలలు, ఆరు జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి దయానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు tmreistelanaga. cggg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9912244005 లేదా హెల్ప్‌లైన్ 040-23437909 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్టు

కామారెడ్డి, జనవరి 29 : పట్టణ పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నేనావత్ గణేశ్, వరియోగుల సాయి అనే యువకులు నాందెడ్‌లో ఆరిఫ్ అనే వ్యక్తితో గంజాయి సరఫరాపై ఒప్పందం కుదుర్చుకొన్నారు. ముగ్గురు కలిసి 300 గ్రాముల గంజాయిని తీసుకొని సోమవారం కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో దిగగా.. పట్టణ పోలీసులు వారిని అరెస్టు చేశారు.

## కోడి పందెం ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి రూరల్, జనవరి 29 : కామారెడ్డి మండలం నర్సన్నపల్లి శివారులో కోడి పందెం ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోడి పందెం ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.56,160 నగదుతోపాటు మూడు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

### జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



జుక్కల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



వొడ్డెపల్లిలో వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పెద్ద కొడప్‌గల్, జనవరి 29: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జుక్కల్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యశోదా నీలూ పటేల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఆయా శాఖల అభివృద్ధి నివేదికను చదివి వినిపించగా, నివేదికలు సమర్పించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగరాజుకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించొద్దని ఎంఈవోకు సూచించారు. అధికారులు, ఉద్యోగులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ నెలాఖరుతో సర్పంచులు పదవీ కాలం ముగుస్తుండగా, వారు అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం..**

నిజాంసాగర్/పెద్ద కొడప్‌గల్/మద్నూర్, జనవరి 29 : జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సోమవారం విస్తృతంగా పర్యటించారు. నిజాంసాగర్ మండలం వొడ్డెపల్లి గ్రామంలో నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు. జుక్కల్ మండలంలోని లాడెగాం గ్రామంలో నిర్మించిన నూతన పంచాయతీ భవనం, గుండూర్‌లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, బస్ షెల్టర్, పౌర సేవాకేంద్రాలను ప్రారంభించారు. మద్నూర్ మండలం కొడిచిర గ్రామంలో నిర్మించిన రైతువేదిక, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. ఎక్లారా, కొడిచిర రోడ్డు నిర్మాణ పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజు, ఏఈవో సంయుక్త, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు వ్యక్తుల బైండోవర్

కామారెడ్డి, జనవరి 29 : పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న ముప్పిల రాజేశ్వర్ రెడ్డి, కల్లెం భగవాన్, రావుల రాజేశ్‌ను సోమవారం ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని గల్లీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు పట్టణంలో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

భిక్కనూరు, జనవరి 29 : 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డీపీవో శ్రీనివాస్‌రావును జంగంపల్లి సర్పంచ్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ సోమవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నికల్ సమస్యతో బిల్లులు చెల్లించలేదన్నారు. నిధులను వెంటనే సర్పంచులకు చెల్లించాలని డీపీవోను కోరినట్లు తెలిపారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్డీవో సాయన్న

కామారెడ్డి, జనవరి 29 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూకు 38, ఉపాధి కల్పన కార్యాలయానికి 3, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 11, ఎస్పీ కార్యాలయానికి 4, మున్సిపల్‌కు 2, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయానికి 3, జిల్లా పంచాయతీకి 2, జిల్లా ఉపాధి కల్పన, గిరిజన సంక్షేమ శాఖకు 3, లీడ్ బ్యాంక్, పరిశ్రమలు, ఎక్సైజ్ జిల్లా మహిళ, శిశు సంక్షేమ కోసం ఒకటి చొప్పున మొత్తం 68 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఏవో సయ్యద్ మసూద్ అహ్మద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పలువురికి వొకేషనల్ అవార్డ్స

కామారెడ్డి, జనవరి 29 : వివిధ రంగాల్లో విశేష కృషిచేసిన వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వొకేషనల్ అవార్డులు ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం మాట్లాడారు. వివిధ రంగాల్లో వృత్తినే దైవంగా భావించి సేవలు అందించిన వారిని గుర్తించి సత్కరించడం గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి సుధాకర్, సీనియర్ సభ్యులు శ్రీశైలం, డాక్టర్ విజయ్ కుమార్, ధనుంజయ, డాక్టర్ బాలరాజు, నంగునూరి కాశీనాథం, చేపూరి కాశీనాథ్‌రావు, ఐత బాలకిషన్, గంగారెడ్డి, అంజన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో నాగేశ్వర్ రావు

బాన్సువాడ రూరల్, జనవరి 29 : మండలంలోని కొయ్యగుట్ట ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెట్టిన భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయుడు బాల్‌రాజుకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## రేపు రగ్బీ పోటీలకు..

కామారెడ్డి, జనవరి 29 : రాష్ట్ర స్థాయి రగ్బీ (అండర్-14 ) పోటీల్లో పాల్గొనడానికి ఈ నెల 31వ తేదీన జిల్లా స్థాయి బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా, రాష్ట్ర సెక్రటరీ నీలం రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010-12 మధ్యలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియానికి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9491038166 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ సెలక్షన్స్

కామారెడ్డి, జనవరి 29 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీన 9వ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్ అండర్-8, 10, 12, 14 బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలకు వివిధ అంశాల్లో సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు పుట్టిన తేదీ, ఎస్సెస్సీ జిరాక్స్‌లతో ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో హాజరుకావాలని సూచించారు.

## కిలో గంజాయి పట్టివేత

నస్రుల్లాబాద్, జనవరి 29 : మండలంలోని దుర్కిలో సోమవారం గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు కొంత కాలంగా గ్రామంలో గంజాయి మొక్కలను పెంచి కూలీలకు అమ్ముతున్నాడని పక్కా సమాచారం మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. అతని వద్ద కిలో 190 గ్రాములు గంజాయి లభించిందని వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

## అబాకస్‌లో చిన్నారుల ప్రతిభ

మద్నూర్, జనవరి 29: మండలకేంద్రంలోని న్యూ ఆదర్శ పాఠశాలకు చెందిన చిన్నారులు అబాకస్‌లో ప్రతిభ కనబర్చారు. సాయిసంస్కృతి జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాదించగా, యాత్ర.. బెస్ట్ పర్‌ఫార్మర్‌గా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు.

## ఈవీఎంలపై అవగాహన

ఎల్లారెడ్డి, జనవరి 29: పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఈవీఎం, వీవీప్యాట్లపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఇందుకోసం ఏర్పాటుచేసిన కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ మహేందర్ కుమార్ తెలిపారు.

## సొసైటీ సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29: పట్టణంలోని సొసైటీ కార్యాలయ సాధారణ సమావేశాన్ని అధ్యక్షుడు ఏగుల నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు నెలలకు సంబంధించి జమా ఖర్చుల వివరాలను కార్యదర్శి విశ్వనాథం చదివి వినిపించారు. అనంతరం గండి మాసానిపేట్ వద్ద గోదాం షట్టర్లు, సీసీ రోడ్, లింగారెడ్డిపేట్ సొసైటీ వద్ద ప్రహరీ, లక్ష్మాపూర్, మాచాపూర్‌లో వంద మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణపై తీర్మానం చేశారు. డైరెక్టర్లు సూర్యప్రకాశ్, పోలు, బాల్‌రాజ్, లక్ష్మణ్, సుఖేందర్‌రెడ్డి, నారాయణ, నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ప్రభుత్వ స్థలంలో మొరం తవ్వకాలు

- అడ్డుకున్న గ్రామస్తులు
- వాహనాలను సీజ్ చేసిన అధికారులు



మొరం టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

సదాశివనగర్, జనవరి 29 : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో జగ్గయ్యకుంట వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో జిల్లాకేంద్రానికి కొందరు జేసీబీలతో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టారు. సర్పంచ్ పైడి జానకీ జనార్దన్ యాదవ్, ఎంపీటీసీలు సంకరి లక్ష్మీరాజలింగం, ఎడ్ల రేణుకా నర్సింహులు, వీడీసీ ప్రతినిధులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్‌తోపాటు రెవెన్యూ, పోలీసులు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మొరం తవ్వకాలపై అనుమతి లేకపోవడంతో వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ ఎడ్ల నర్సింహులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సంకరి రాజలింగం, గంగాసాని సాగర్‌రెడ్డి, ముదాం నడ్పిసత్యం, పయ్యావుల గంగాధర్, నంశగారి లశోక్, సంకరి నారాయణ, సాదక్ అలీ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

## పోలీసులకు సహకరించాలి

సదాశివనగర్, జనవరి 29 : శాంతి భద్రతల పరిరక్షణకు రాత్రింబవళ్లు పనిచేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు కోరారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేరాలు జరిగిన వెంటనే బాధితులు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందజేస్తే నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, హైవే సిబ్బందితోపాటు పోలీసులు కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



## పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి

సదాశివనగర్, జనవరి 29 : సదాశివనగర్, రామారెడ్డి మండలాల ఐక్య సమాఖ్య గాయత్రీ బ్రాహ్మణ సంఘం 20వ వార్షికోత్సవాన్ని మండలంలోని మల్లన్న గుట్టవద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ మాట్లాడుతూ.. పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## మత్స్యకార్మికులకు శిక్షణ

నిజాంసాగర్, జనవరి29: మండలంలోని అచ్చంపేట రైతువేదికలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఇండియన్ ఇమ్యూనాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మత్స్య కార్మికులకు రెండురోజులపాటు నిర్వహించే శిక్షణను సోమవారం ప్రారంభించారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటిలో పడిపోయినవారిని రక్షించే విధానంపై ఇండియన్ రిసోర్స్ అకాడమీ అధికారులు మహేశ్, పూర్ణచందర్‌రావు అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ ఎగ్జిక్యూటివ్ భార్గవి మాట్లాడుతూ ప్రమాద బీమా, గ్రూప్ ఇన్సూరెన్స్ విధి విధానాల గురించి వివరించారు. ఈ శిక్షణకు నిజాంసాగర్ రిజర్వాయర్‌లో చేపలు వేటాడే 75 మంది పాల్గొనగా, మిగితావారికి మంగళవారం శిక్షణ ఇస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తెలిపారు.



నీటిలో పడిపోయినవారిని ప్రాణాపాయం నుంచి రక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



## రాములోరి కల్యాణానికి తలంబ్రాలు

భద్రాది సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన భక్తులు తలంబ్రాలను సిద్ధం చేశారు. పట్టణంలోని బిందర్ మందిరంలో సోమవారం ధాన్యాన్ని వొలిచి తలంబ్రాలను తయారుచేశారు. వీటిని భద్రాచలం రామాలయానికి పంపించనున్నట్లు తెలిపారు.

–ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29

## పార్కు స్థలాన్ని కబ్జానుంచి కాపాడాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29: మండలంలోని మాచాపూర్ పంచాయతీ పరిధిలో ఏర్పాటుచేసిన బృహత్ పల్లె ప్రకృతి వనం స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మహేందర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాప్తిజాన్కంపల్లి తండాకు చెందిన శంకర్.. పార్కులోని చెట్లను ధ్వంసం చేసి స్థలాన్ని కబ్జా చేశాడని, బోరు మోటర్‌కు విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించినట్లు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. భూమిని సర్వేచేయించి హద్దులు ఏర్పాటు చేయాలని, పార్కును కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాచాపూర్ మాజీ సర్పంచ్ నారాగౌడ్, స్థానిక నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

## సిబ్బంది తీరు ఇలా.. వైద్యం అందేదెలా?

గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం పల్లె దవాఖానలను ఏర్పాటు చేసింది. కానీ సిబ్బంది నిర్లక్ష్యంతో లక్ష్యం నెరవేరడంలేదు. మండలంలోని గిర్నితండాలో ఉన్న పల్లె దవాఖాన సిబ్బంది సోమవారం ఉదయం 11 గంటల వరకు విధులకు హాజరులేదు. దీంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు దవాఖానకు వెళ్లాల్సి వస్తున్నదని తండా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–నిజాంసాగర్, జనవరి 29



గిర్నితండా పల్లె దవాఖానలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పెద్ద కొడప్‌గల్/బిచ్కుంద, జనవరి 29: నేషనల్ హైవే పరిధిలోని పాఠశాలల్లో గతేడాది ప్రతిభ కనబర్చిన 54 మంది ఎస్సెస్సీ విద్యార్థులను ఎంపికచేసి నగదు ప్రోత్సాహకాలతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద కొడప్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శివ ప్రసాద్, చందన, బిచ్కుంద పాఠశాలకు చెందిన శ్రీకాంత్, బస్వరాజ్ ప్రోత్సాహకాలను అందుకున్నట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రకాంత్, హెచ్‌ఎం కిశోర్ తెలిపారు.

## ముగిసిన వాలీబాల్ పోటీలు



ఫైనల్‌లో తలపడుతున్న తాడ్వాయి, గుడివెనుక తండా జట్లు

గాంధారి, జనవరి 29: మండల కేంద్రంలోని గ్రామీణ క్రీడా మైదానంలో బాగారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగిన నియోజకవర్గపు స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం 40 జట్లు పాల్గొనగా.. తాడ్వాయి జట్టు విజయం సాధించింది. గుడివెనుక తండా జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ. 30 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.20 వేలు, రూ. 10 వేల చొప్పున బహుమతులను ట్రస్టు నిర్వాహకుడు జైపాల్‌రెడ్డి అందజేశారు.

## క్యాలెండర్ల ఆవిష్కరణ



పద్మశాలీ సంఘ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద/దోమకొండ, జనవరి 29: పద్మశాలీ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బిచ్కుంద మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సోమవారం ఆవిష్కరించారు. దోమకొండ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలీశ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమ అధ్యక్షుడు శివరాములు ఆవిష్కరించారు.

## పరీక్షలపై ఆందోళ న చెందొద్దు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో వెంకటేశం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందొద్దని ఎంఈవో వెంకటేశం సూచించారు. పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ప్రేరణ సమావేశం ఏర్పాటు చేశారు. వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు ఎలా సిద్ధం కావాలో వివరించారు.